# జిల్లావార్తలు

8వ పేజీ కొరవ

ఆయన సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసు వితుదల చేయించారు. సుగుణమ్మ జిల్లా కలెక్టరుకు సంజాయిషీ అందజేసి ఈ వ్యవహారాన్ని ప్రత్యేకంగా ఎన్నికల అధికారిచే విచారణ చేయించాలని కోరారు. ఈ నేపథ్యంలో గత నెల 27వ తేది సాయంత్రం అధికారిణి సుమన విచారణ జరిపారు. తర్వాత సుగుణమ్మను సభ్యత్వం నుంచి, పదవి నుంచి తొలగించినట్లు అధికారులు చివరి ఆదేశాలు జారీ చేశారు. ఎంపిపి స్థానం తమకే చెందాలంటూ కాంగ్రెస్ నేతలు చేవూరు దేవకుమార్‌రెడ్డి, తుంగా దయాకర్‌రెడ్డి, తుంగా గిరిధర్‌రెడ్డి హైకోర్టులో రిట్ దాఖలు చేసి విజయం సాధించారు. మండలాధ్యక్షురాలి సీటులో సుగుణమ్మనే కొనసాగించమని హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఎన్నిక ఎట్టకేలకు తిరిగి సుగుణమ్మనే పదవి వరించిందని తెలుసుకున్న నేతలు ఆనందోత్సాహాలలో మునిగి తేలారు. ఆమెకు పదవి పోయేలా చేసిన బిజెపి నేతలకు ఈ ఆదేశాలు మింగుడు పడడం లేదు.

## గంట విచారణ ఉత్కంఠ భరితం

సంగం ఎంపిపి సుగుణమ్మ విప్ ధిక్కారంపై జూలై 30తేది విచారణ జరిగింది. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ఈ తంతు 55 నిమిషాలు పాటు కొనసాగింది. ఎంపిపి కార్యాలయం చుట్టూ బిజెపి, కాంగ్రెస్, దేశం నేతలు గుమికూడి క్షణ, క్షణం భయం, భయంగా కాలం గడిపారు. బిజెపి నేతలు మహబూబ్‌బాషా, కంటాబత్తిన రవీంద్రరెడ్డి, కాంగ్రెస్ నేతలను పలు పలు విధాలుగా తిట్టి గందరగోళ వాతావరణం సృష్టించారు. ఈ విచారణకు 'రాజు వెడలె రవితేజము లరయగ' అన్నట్లు కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి మంది మార్బలంతో వచ్చి ఓ మూల కూర్చున్నారు. ప్రభుత్వం మాది అన్నట్లుగా చర్చ జరుగుతున్న కార్యాలయంలోకి వెళ్లాలని ఎమ్మెల్యే ప్రయత్నించగా ఎన్నికల అధికారి సుమన అంగీకరించక పోవడంతో సిగ్గుపడ్డాడు ప్రసన్నకుమార్‌రెడ్డి. బిజెపి కార్యకర్తలు సృష్టించిన వాతావరణానికి కాంగ్రెస్ నేతలు ఎదురు తిరిగివుంటే సంగంలో కర్ఫ్యూ విధించాల్సిన పరిస్థితులు నెలకొనేవి. కాంగ్రెస్ నేతలు చేవూరు దేవకుమార్‌రెడ్డి, తుంగా దయాకర్‌రెడ్డి తమ కార్యకర్తలను శాంతింపజేసి విచారణకు ఎటువంటి భంగం జరుగకుండా చూశారు.

సంగం ఎంపిపి సుగుణమ్మ విప్ తమకు జారీకాలేదని చెప్పారు. సుగుణమ్మ చెప్పిన విషయాలను రికార్డు చేసుకొన్న సుమన ఈ విచారణపై జిల్లా కలెక్టర్ తుదినిర్ణయం తీసుకుంటారని విలేఖర్లకు చెప్పి హడావుడిగా నెల్లూరు వెళ్లారు.

## అయిదు పంచాయతీలకు ఏకగ్రీవ ఎన్నిక

పొదలకూరు మండలంలోని ఐదు పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ మద్దతు యిచ్చిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మరుపూరు, చాటగోట్ల, కనువర్తి, చెన్నారెడ్డిపల్లి, నందివాయ పంచాయతీలు ఇందులో వున్నాయి.

## ఏకగ్రీవ ఎన్నికకు 5వేలు

వెంకటగిరికి చెందిన ఆయిల్ మిల్లుఓనరు సజ్జా చెంచయ్య వెంకటగిరి మండలంలో ఈ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకొన్న పంచాయతీలకు తాను స్వచ్ఛందంగా ప్రతి పంచాయతీకి 5వేల రూపాయల వంతున విరాళం ఇస్తానని ముందుకొచ్చారు. ఈ మొత్తంతో ఏదైన అభివృద్ధి కార్యక్రమం చేసుకోమని సలహా యిచ్చారాయన.

# నెల్లూరుముచ్చట్లు

6వ పేజీ కొరవ

చిన్నల పిల్లల ఆస్పత్రిలో 5తేది 3వ విడత ఉచిత మెదడు వాపు వ్యాధి టీకా శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని నెల్లూరు ఎమ్పీ డాక్టర్ ఉక్కాల రాజేశ్వరమ్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి, ఆయన సతీమణి వసంత లక్ష్మి కూడా పాల్గొన్నారు.

## ఉచిత పోలియో ఆపరేషన్ల శిబిరం

నెల్లూరు లోని 'నమస్కార్' స్వచ్ఛంద సేవా సంస్థ పోలియో వ్యాధి వల్ల వికలాంగులైన, పుట్టుకతో అంగ వైకల్యం వచ్చిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తుంది. ఈ చికిత్సా శిబిరం 26తేది టౌన్‌హాల్‌లో నిర్వహించి అర్హులైన వారిని ఎంపికచేసి, నారాయణ జనరల్ హాస్పిటల్‌లో ఆపరేషన్లను ప్రముఖ సర్జన్ ఎస్వీ ఆదినారాయణ చేస్తారు. శిబిరానికి రావాలనుకొన్న వారు 20తేదిలోగా తమ పేర్లను డాక్టర్ జడ్.శివప్రసాద్, సిద్ధార్థ చిన్నపిల్లల హాస్పటల్, విజయమహల్ గేటు వద్ద నమోదు చేసుకోవచ్చు.



పొదలకూరులో ఉచితవైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మండలాధ్యక్షుడు నోటి మాలకొండారెడ్డి. ప్రక్కన డాక్టర్లు మురళీశంకర రెడ్డి, పెంచలరెడ్డి, కోట మనోహర్, తదితరులున్నారు.

## మరణాలు

నెల్లూరు టౌన్‌లో ప్రముఖ ప్రావిజన్ షాపుగా పేరుగాంచిన నాగరాజం ప్రావిజన్‌స్టోర్స్ స్థాపకుడు స్వర్గీయ వీరాశెట్టి నాగరాజం సతీమణి వెంకట నరసమ్మ (68) 7తేది హృద్రోగంతో నెల్లూరులో మరణించారు. మురళీకృష్ణ గ్రూపు హోటళ్ల నిర్వాహకుడు హజరత్‌బాబు, నాగరాజం ప్రావిజన్ స్టోర్స్ ప్రసాదరావు, మంచూరి, వెంకటరమణ హోటళ్ల వెంకట సుబ్బారావు ఈమె కుమారులే. ఇద్దరు కుమార్తెలు కూడా నరసమ్మకు వున్నారు.

***

నెల్లూరు సంతపేటలో ప్రముఖ కొయ్య వ్యాపారి నాళం రమణయ్య 25తేది మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు.

ఆత్మీయులను కోల్పోయిన పై రెండు కుటుంబాల వారికి మా సానుభూతి.

**జమీన్‌రైతు చందా**
సంవత్సరానికి రూ.100లు



# శ్రద్ధాంజలి



కీ.శే. శ్రీమతి వీరిశెట్టి వెంకటనరసమ్మ గారు
(W/o లేట్ వీరిశెట్టి నాగరాజం గారు)
మరణం : 7-8-2001, నెల్లూరు

మంచితనం మూర్తీభవించిన మనసున్న మంచిమనిషి
పదిమందికి సహాయపడాలని
అనునిత్యం పరితపించే మానవతావాది

## శ్రీమతి వీరిశెట్టి వెంకటనరసమ్మ గారి

మరణం మావంటి వారెందరికో తీరనిలోటు, ఆమె ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ... ఆమె కుమారులు **శ్రీ వీరిశెట్టి హజరత్ బాబుగార్కి** మరియు వారి **కుటుంబ సభ్యులకు** మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

స్టాఫ్

మురళీకృష్ణ 70 A/c రెస్టారెంట్
మురళీకృష్ణ వెజిటేరియన్
మురళీకృష్ణ నేతిమిఠాయిలు
మురళీకృష్ణ పిక్‌నిక్ ఐస్‌క్రీమ్స్
హోటల్ మురళీకృష్ణ 70 A/c 3 స్టార్
మురళీకృష్ణ 70 A/c బార్ & రెస్టారెంట్
నెల్లూరు

